బాబును కలిసిన తెలంగాణ స్పీకర్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆదివారం తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వసతి, దర్శనానికి సంబంధించి తెలంగాణ ఎమ్మెల్యేల లేఖలకు అర్హత కల్పించాలని ఆయన బాబును కోరారు.

– వికారాబాద్

వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): వయనాడ్ ముంపు ప్రాంతాలను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. దాదాపు 416 మంది ప్రాణ నష్టం జరిగిందని, అందులో 47మంది సీపీఐ నాయకులను కోల్పోయినట్టు చెప్పారు. మృతి చెందిన కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.వయనాడ్‌ను జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్శనలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం సాయికుమార్, నాయకులు సాధిక్, అయ్యప్ప, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీకే మూర్తి, సీపీఐ వయనాడ్ జిల్లా కార్యదర్శి, ఐఏఎల్ రాష్ట్ర సభ్యుడు ఈ జే బాబు, ఏబీ చరియన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎన్నారైలకు అవమానం

- సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో అంతా ఏపీ ఎన్నారైలు, టీడీపీ నేతలే
- కలిసేందుకూ తెలంగాణ ఎన్నారైలకు అవకాశం ఇవ్వని రేవంత్
- బాధతో సోషల్ మీడియాలో పోస్టులు
- ఎంవోయూలపై ఈడీ విచారణకు డిమాండ్
- రేవంత్ పర్యటనలో అంతా 'ఆయనే'
- స్వచ్ఛ్‌బయో ఒప్పందంలోనూ కీలకం

అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి , మంత్రి శ్రీధర్‌బాబు (ఫైల్)

హైదరాబాద్, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై అక్కడి తెలంగాణ ఎన్నారైలు, టీకాంగ్రెస్ అభిమానులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ సీఎంగా అమెరికా పర్యటనకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ఎన్నారైలు, కాంగ్రెస్ అభిమానులను తప్ప మిగతా అందర్నీ పట్టించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ తమ ఆవేదనను వెల్లడిస్తున్నారు. మిషన్ తెలంగాణ, ఫ్రెండ్స్ ఆఫ్ కాంగ్రెస్ యూఎస్ఏ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పోస్టులతో విమర్శలు గుప్పిస్తున్నారు. సీఎంగా తొలిసారి అమెరికాకు వచ్చిన రేవంత్‌రెడ్డిని ఆహ్వానించేందుకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కొన్ని సంస్థల ప్రతినిధులు శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా ఎయిర్‌పోర్టుకు వెళ్లగా వారిని బయటే నిలబెట్టి, అవమానించారంటూ మిషన్ తెలంగాణలో పోస్ట్ చేశారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ వంటి పలు సంస్థల ప్రతినిధులనూ లోనికి అనుమతించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే చంద్రబాబు మద్దతుదారులు, ఏపీకి చెందినవారికి రేవంత్ అధిక ప్రాధాన్యం ఇచ్చారంటూ తెలంగాణ ఎన్నారైలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎంను ఆహ్వానించటానికి వెళ్లినవారిలో ఒక్క ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మినహాయిస్తే మిగిలిన 95 శాతం మంది ఏపీ, టీడీపీవాళ్లేనని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ఎంతో దూరం నుంచి ఎయిర్‌పోర్టుకు వచ్చిన తమకు కలిసేందుకు అవకాశం ఇవ్వలేదని, కానీ ఏపీ ఎన్నారైలు సులువుగా కలుసుకోగలిగారంటూ ఎన్నారై సతీశ్ పసుపులేటి ఆవేదన వ్యక్తంచేశారు. నిబంధనలు, సెక్యూరిటీ పేరుతో తమను దూరం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ, టీడీపీనేతలే కాదు.. కర్ణాటక నేతలు కూడా కొందరు సీఎం రేవంత్‌రెడ్డిని కలవటం గమనార్హం. కర్ణాటక నేతలను కూడా కలిసేందుకు ఇష్టపడ్డ సీఎం.. తెలంగాణ కోసం కొట్లాడిన, తెలంగాణవాదులైన తమను కలిసేందుకు ఇష్టపడటం లేదని తెలంగాణ ఎన్నారైలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పెట్టుబడులపై విచారణ జరిపించాలి

అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి బృందం చేసుకుంటున్న ఎంవోయూలపై విచారణ జరిపించాలని ఫ్రెండ్స్ ఆఫ్ కాంగ్రెస్ యూఎస్ఏ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాహుల్‌గాంధీకి ట్విటర్ ద్వారా ఫిర్యాదు చేసింది. వెబ్‌సైట్ కూడా లేని కంపెనీతో ఒప్పందం చేసుకోవటం ఏమిటి? అని ప్రశ్నించారు. ఎలాంటి పేరు ప్రఖ్యాతులు లేని సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడి కంపెనీతో ఒప్పందం చేసుకోవటాన్ని కూడా ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను టీడీపీ, ఇతర ప్రాంతాల ఎన్నారైలే నడిపిస్తున్నారని ఆరోపించారు. ఎంవోయూల్లో కుటుంబ కంపెనీల భాగస్వామ్యం లేకుండా చూడాలని రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు. ఎంవోయూలపై త్వరలోనే ఈడీ విచారణ కోరుతామని పేర్కొన్నారు.

అంతా 'ఆయనే'..?

తెలంగాణకు చెందిన కాంగ్రెస్ అనుకూల మీడియా ప్రతినిధి సీఎం అమెరికా పర్యటనలో అంతా తానై వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. స్వచ్ఛ్‌బయో కంపెనీతో ఒప్పందంలో ఆయనదే కీలక పాత్ర అని తెలిసింది. కొన్ని ఎంవోయూల్లోనూ ఆయన కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. హర్ష పసునూరి, జగదీశ్వర్‌రెడ్డితో కలిసి స్వచ్ఛ్‌బయో ఏర్పాటులో ఆ వ్యక్తి కీలకంగా ఉన్నారని తెలిసింది.

అడవిదేవులపల్లి మండలం చిట్యాలలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకుంటున్న గ్రామస్థులు

మంత్రి ఉత్తమ్ కాన్వాయ్ అడ్డగింత

అడవిదేవులపల్లి, ఆగస్టు 11 : తమకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టెయిల్‌పాండ్ నిర్వాసితులు, గ్రామస్థులు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాన్వాయ్‌ని ఆదివారం అడ్డుకున్నారు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం చిట్యాల గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న దున్నపోతుల గండి లిఫ్ట్ పనులను పరిశీలించడానికి నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌పాటి, ఎన్నెస్పీ చీఫ్ ఇంజినీర్ అనిల్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కాన్వాయ్‌ని వారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు, స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వారిని తప్పించే ప్రయత్నం చేయగా కొంత ఉద్రిక్తత చోటుచేసుకున్నది. తమకు తాగునీరు రావడం లేదని, ఇండ్లల్లోకి పాములు, తేళ్లు వస్తున్నాయని నిర్వాసితులు ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని మంత్రిని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

హైదరాబాద్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ

- ఏఐ ఆధారిత డాటా సెంటర్‌పై మంత్రి దుద్దిళ్ల లో చర్చలు
- బీఆర్ఎస్ హయాంలోనే పెరిగిన కంపెనీ కార్యకలాపాలు

మంత్రి శ్రీధర్‌బాబుతో అమెజాన్ వీపీ

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ) : అమెజాన్ కంపెనీ హైదరాబాద్‌లో తన డాటా సెంటర్‌ను విస్తరించేందుకు ముందుకొచ్చింది. అమెరికా పర్యటనలో ఉన్న పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కంపెనీ వెబ్ సర్వీసెస్ డాటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్, కంపెనీ ప్రతినిధులు ఆదివారం సమావేశమయ్యారు. తెలంగాణలో డాటా సెంటర్ కార్యకలాపాలపై చర్చించారు. కాగా బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణలో అమెజాన్ కంపెనీ కార్యకలాపాలను భారీగా విస్తరించింది. ప్రపంచంలోనే అమెజాన్‌కు చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకున్న విషయం విదితమే. గతేడాది అమెజాన్ డెడికేటెడ్ ఎయిర్ కార్గో నెట్‌వర్క్ 'అమెజాన్ ఎయిర్'ను ప్రారంభించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్‌కు సంబంధించి హైదరాబాద్‌లో మూడు డాటా సెంటర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లర్నింగ్ ఆధారిత సేవలతో కొత్త హైపర్ స్కేల్ డాటా సెంటర్‌తో తమ వ్యాపారాన్ని విస్తరించే ఆలోచనలను కంపెనీ ప్రతినిధులు మంత్రితో పంచుకున్నారు.

చర్చలు విజయవంతం : శ్రీధర్‌బాబు

అమెజాన్‌తో చర్చలు విజయవంతమయ్యాయని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రభుత్వం తరపున తగిన సహకారంతోపాటు ఉత్తమ ప్రోత్సాహకాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చినట్టు చెప్పారు.

పిచ్చికుక్కల దాడిలో గాయపడిన బాధితుడు

రెచ్చిపోయిన పిచ్చికుక్కలు

- ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఏడుగురిపై దాడి
- దవాఖానలో చికిత్స.. ముగ్గురి పరిస్థితి విషమం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 11: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో పిచ్చికుక్కలు రెచ్చిపోయాయి. అదే గ్రామానికి చెందిన ఏడుగురిపై ఆదివారం ఉదయం దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. చేపూర్‌కు చెందిన వేల్పూల నర్సయ్య, కళ, పోసాని, లత, గంగారాం, భట్టు లాస్య, రాజగంగారాంపై ఉదయం 10.30 గంటలకు కుక్కలు ఒకదాని వెనుక మరోటి గుంపులుగా వచ్చి దాడి చేశాయి. దాడిలో గాయపడిన వారిని స్థానికులు ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నలుగురికి ఆర్మూర్ దవాఖానలో వైద్యం అందించగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా దవాఖానకు తరలించారు. కుక్కలు వెంటపడి ప్రజలపై దాడులు చేస్తున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

నెమలి కూర వండటం ఎలా?

యూట్యూబ్‌లో వీడియో అప్‌లోడ్ • కటకటాల్లో యూట్యూబర్

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): జాతీయ పక్షి నెమలి కూరను ఎలా వండాలో వివరించి కటకటాలు లెక్కపెడుతున్నాడు సిరిసిల్లకు చెందిన ఓ యూట్యూబర్. సిరిసిల్లలోని తంగళ్లపల్లికి చెందిన కోడం ప్రణయ్‌కుమార్ సంప్రదాయ వంటకాలపై వీడియోలు చేసి శ్రీటీవీ అనే యూట్యూబ్ చానెల్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం సాంప్రదాయ పద్ధతిలో నెమలి కూర ఎలా వండాలో చూడండి అంటూ 'ట్రెడిషనల్ పీకాక్ కర్రీ రెసిపీ' అన్న పేరుతో యూట్యూబ్‌లో వీడియో అప్‌లోడ్ చేశాడు. దీనిపై జంతు ప్రేమికుల నుంచే కాకుండా సామాన్యుల నుంచి కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో వెంటనే స్పందించిన యూట్యూబ్ ఆ వీడియోను తొలగించింది. కానీ అప్పటికే ఓ 140 మందికి పైగా ఆ వీడియో చూశారు. అతడే నిషేధిత జాబితాలో ఉన్న అడవి పంది కూర ఎలా ఉండాలో కూడా వీడియో తీసి ఇంతకుముందు అప్‌లోడ్ చేశాడు. వన్యమృగాలను, జాతీయ పక్షిని వేటాడం నేరమని తెలిసి కూడా వాటిని చంపి కూర వండటమే కాకుండా.. ఆ వీడియోలను అప్‌లోడ్ చేయడంపై జంతు ప్రేమికులు మండిపడుతున్నారు. ఈ విషయం తెలిసిన సిరిసిల్ల ఫారెస్ట్ అధికారులు ప్రణయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్దనుంచి నెమలికూర వీడియోను స్వాధీనం చేసుకున్నామని ఎఫ్‌ఆర్‌వో కల్పనాదేవి చెప్పారు. అతని వద్ద స్వాధీనం చేసుకున్న కూరను ల్యాబ్ టెస్ట్‌కు పంపించామని తెలిపారు.

నెమలి కూర వండుతున్నట్టుగా యూట్యూబర్ ప్రణయ్‌కుమార్ తీసిన వీడియోలోని చిత్రం

ఆర్టీసీ కార్గోలో రాఖీల డెలివరీ

- 24 గంటల్లో చేరవేత
- కార్గో సెంటర్లలో ప్రత్యేక కౌంటర్లు
- 5 రోజుల ముందునుంచే సేవలు

హైదరాబాద్, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ): రాఖీ పండుగ సందర్భంగా కలిసి పండుగ చేసుకునే అవకాశం లేని తోబుట్టువుల కోసం టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకున్నది. పండుగకు నాలుగైదు రోజుల ముందు నుంచి కార్గో సెంటర్లలో కౌంటర్లు తెరిచి దూర ప్రాంతాల్లో ఉన్నవారికి రాఖీలు సులభంగా పంపే వీలుకల్పిస్తున్నది. రాఖీలతోపాటు స్వీట్ బాక్సులు, బహుమతులు, ఇతర సామగ్రిని కూడా పంపే అవకాశం కల్పిస్తున్నది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు రాఖీలు పంపించుకునే సదుపాయం కల్పిస్తున్నది. ఇందుకోసం అన్ని బస్టాండ్లలోని కార్గో సెంటర్లలో కౌంటర్లు ఏర్పాటు చేశారు.

బిడ్డలను కాపాడబోయి..

- రైలు ఢీకొని తండ్రి, ఇద్దరు కూతుళ్ల దుర్మరణం
- గౌడవెల్లి స్టేషన్‌లో ప్రమాదం
- భార్య కళ్లెదుటే ఘోరం

భార్య కవిత(బీర కట్టుకున్న మహిళ), ఇద్దరు కూతుళ్లు వర్షిత, వరిణితో కృష్ణ

మేడ్చల్, ఆగస్టు 11: రెప్పపాటులో ఘోరం జరిగింది. ఆదివారం కావడంతో ఆటవిడుపుగా వచ్చి ఆనందంగా గడుపుదామనుకున్న కుటుంబంలో అంతులేని విషాదం నిండింది. బిడ్డలను కాపాడబోయి తండ్రి సైతం రైలు ఢీకొని మృత్యువాతపడటం చూపరులను కలిచివేసింది. కళ్లెదుటే భర్త, ఇద్దరు కూతుళ్లు తునాతునకలు కావడంతో ఆ ఇల్లాలి రోదనకు అంతులేకుండాపోయింది. మేడ్చల్ మండలం గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో జరిగిన ఈ ఘటన రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ పట్టణానికి చెందిన కృష్ణ(38) రైల్వే ఉద్యోగి. ఆయన గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో కీమాన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో తన భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు వర్షిత(11), వరిణి (5)ని తీసుకొని గౌడవెల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. కృష్ణ రైల్వే ట్రాక్‌పై పనిచేస్తుండగా భార్యాబిడ్డలు ప్లాట్‌ఫాంపై ఉన్నారు. కొద్దిసేపటి తర్వాత కృష్ణ ఒక ట్రాక్‌లో పనిచేస్తుండగా ఇద్దరు బిడ్డలు మరో ట్రాక్‌లోకి ఆడుకునేందుకు వచ్చారు. అదేసమయంలో నాందేడ్ నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ గౌడవెల్లికి చేరువగా వచ్చింది. తాము ఉన్న ట్రాక్ పైనుంచే రైలు వస్తున్నట్టు పిల్లలు గర్తించలేదు. కృష్ణ కూడా పనిలోపడి దగ్గరికి వచ్చేదాకా గుర్తించలేదు. రైలు సమీపిస్తున్న సమయంలో గుర్తించి వేగంగా కదిలి పిల్లలను ట్రాక్ నుంచి పక్కకు తప్పించే ప్రయత్నంలో రెప్పపాటులో ముగ్గర్నీ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిల్లల చేతులు, కాళ్లు తెగిపడగా, కృష్ణ ముఖం, అవయవాలు చితికిపోయి గుర్తుపట్టలేనంతగా నుజ్జునుజ్జయ్యాడు. ఈ ఘటన ప్లాట్‌ఫాంపై ఉన్న కవిత కళ్లెదుటే జరగడంతో ఆమె ఒక్కసారిగా షాక్ గురైంది. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కలపై పులి దాడి!

కెరమెరి, ఆగస్టు 11 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోలి గ్రామంలో శనివారం రాత్రి పులి కుక్కలపై దాడిచేసింది. ఓ గుడిసెలో గొలుసులతో శునకాలను కట్టేసి ఉంచగా చంపేసింది. ఒకదాన్ని సగం వరకు తిని వదిలేసి వెళ్లింది. విషయం తెలుసుకున్న కెరమెరి ఎఫ్ఆర్వో సయ్యద్ మజారొద్దీన్ సిబ్బందితో ఆ గ్రామానిక చేరుకొని కుక్కల కళేబరాలు, పులి అడుగులను పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన త ర్వాత పులి దాడి చేసిందో లేదో నిర్ధారిస్తామని తెలిపారు. ఏదిఏమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

హాస్టల్ విద్యార్థి మృతిపై ఐటీడీఏ పీవో సీరియస్

డిప్యూటీ వార్డెన్ సస్పెన్షన్, హెచ్ఎంకు షోకాజ్ నోటీసు

దుమ్ముగూడెం, ఆగస్టు 11 : మండల పరిధిలోని కొత్తపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థి కుంజా దీపక్ మృతిపై భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ సీరియస్ అయ్యారు. విధుల పట్ల అలసత్వం వహించిన ఆశ్రమ వసతిగృహం డిప్యూటీ వార్డెన్ హరికృష్ణను సస్పెండ్ చేయడంతోపాటు హెచ్ఎం నర్సింహారావుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. మండల పరిధిలోని బండారుగూడెంకు చెందిన దీపక్ కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రెండురోజులు సెలవులు రావడంతో స్నేహితులతో కలిసి తన స్వగ్రామానికి ఆటోలో బయలుదేరుతుండగా ఎటపాక మండలం తునికిచెరువు వద్ద గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో దీపక్ మృతిచెందడంతో విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన హరికృష్ణను సస్పెండ్ చేయడంతోపాటు హెచ్ఎంకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఐటీడీఏ ట్రైబల్‌వెల్ఫేర్ డీడీ మణిమ్మను ఆదేశించారు. పీవో ఆదేశాల మేరకు ఆమె వారికి షోకాజ్ నోటీసు అందించారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 11 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో హార్డ్‌కోర్ నక్సలైట్ ఒకరు మృతిచెందిన ఘటన దంతేవాడ జిల్లాలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం దంతేవాడ పోలీసులు వెల్లడించారు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దక్షిణ బస్తర్ డివిజన్‌లోని దంతేవాడ జిల్లా ఇంద్రావతి నదీ ప్రాంతంలోని మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ఆ ప్రాంతంలో భద్రతాదళాలు శనివారం రాత్రి సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. జవాన్లు ఇంద్రావతి నది తీవ్ర ప్రవాహాన్ని దాటుకుని వెళ్లడంతో అక్కడ మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఈ కాల్పుల్లో హార్డ్‌కోర్ మావోయిస్టు ఒకరు మృతిచెందాడు. కాల్పుల విరమణ అనంతరం మావోయిస్టు మృతదేహంతోపాటు, వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనపరుచుకున్నారు. మృతిచెందిన మావోయిస్టు పరమేష్ వెక్కోగా గర్తించినట్లు, అతడిపై రూ.లక్ష రివార్డు ఉన్నట్లు పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.

రైతుల సమస్యలుంటే రోజుల తరబడి తాళం..

ప్రైవేటు కోసం వెనువెంటనే శుభ్రం

- ఏఈవో బదిలీ కావడంతో సారపాక రైతువేదికకు తాళం
- రోజులపాటు అధికారులు లేక అన్నదాతల ఆందోళన పర్వం
- ఎమ్మెల్యే రాకతో హడావిడిగా తాళం తీసి శుభ్రం చేయించిన వైనం
- ప్రైవేటు కార్యక్రమాలకు వినియోగిస్తుండడంపై కర్షకుల అసహనం

సారపాక, ఆగస్టు 11: రైతుల సంక్షేమం కోసం గత కేసీఆర్ ప్రభుత్వం రైతువేదికలను నిర్మిస్తే వాటిలో రైతులకు సూచనలు చేయాల్సిన అధికారులు లేక తాళం వేసి ఉండడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. సారపాక క్లస్టర్ తాళ్లగొమ్ముారులోని రైతువేదికకు శనివారం వరకూ తాళం వేసి ఉండడంతో తమ సమస్యలు చెప్పేందుకు వచ్చిన రైతులకు నిరాశే మిగులుతోంది. ఈ క్లస్టర్ పరిధిలోని ఏఈవో బదిలీ కావడంతో రైతువేదికకు తాళం వేసి ఉంది. కొత్తగా ఇక్కడ బాధ్యతలు తీసుకోవాల్సిన ఏఈవో ఇల్లెందు నుంచి రావాల్సి ఉంది. రైతువేదికకు తాళం వేసి ఉండటంతో రైతులు వచ్చి వెనుదిరిగిపోతున్నారు.

ప్రైవేటు కార్యక్రమానికి వినియోగం?

ఇదిలా ఉండగా ఆదివారం స్థానిక ఎమ్మెల్యే పర్యటన ఉండడంతోపాటు ఇదే రైతువేదికలో ఐటీసీ రోటరీ, రోటరాక్ట్ క్లబ్‌లు వైద్యశిబిరం ఏర్పాటు చేశాయి. దీంతో ఈ రైతువేదికను ఇక్కడి సిబ్బంది శనివారం రాత్రి హడావిడిగా శుభ్రం చేసి వైద్యశిబిరానికి సిద్ధం చేశారు. రైతులకు ఉపయోగపడేవిధంగా లక్షల రూపాయలతో నిర్మించిన ఈ రైతువేదిక తమకు ఉపయోగపడకపోగా ప్రైవేటు కార్యక్రమాలకు వినియోగించడం పట్ల రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

శనివారం వరకూ తాళం వేసి ఉన్న సారపాక క్లస్టర్ రైతువేదిక

రైతులు నా కార్యాలయానికి వచ్చి కలవొచ్చు..

సారపాక ఏఈవో బదిలీ అయ్యారు. కొత్తగా ఎవరూ చార్జి తీసుకోలేదు. ఆ క్లస్టర్ పరిధిలోని రైతులకు సమస్యలుంటే మండల కేంద్రమైన బూర్గంపహాడ్‌కు రావొచ్చు. ఇక్కడి రైతువేదికలో ఉన్న నా కార్యాలయంలో నన్ను కలిసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

–శంకర్, ఏవో, బూర్గంపహాడ్

రైతుబీమా రిజిస్టర్ నిమిత్తం వచ్చాం..

రైతుబీమా రిజిస్టర్ చేయించుకునేందుకు రైతువేదికకు కొన్ని రోజుల నుంచి వస్తున్నా. ఇక్కడ రైతువేదికకు తాళం వేసే ఉంటుంది. బూర్గంపహాడ్ రైతువేదిక వద్దకు కూడా వెళ్లాం. అక్కడ కూడా ఎవరూ లేరు. పనులు మానుకుని వస్తున్నా.

–సోయం భద్రయ్య, రైతు, ఇరవెండి

రుణమాఫీ ఎందుకు కాలేదో తెలుసుకుందామని వచ్చా..

ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసింది. ఆ జాబితాలో అర్హత ఉన్నా నాకు మాత్రం రుణమాఫీ కాకపోవడంతో ఏఈవోను అడిగి తెలుసుకునేందుకు కొన్ని రోజులుగా ఇక్కడకు వస్తున్నా. రైతువేదికకు తాళం వేసి ఉండటాన్ని చూసి వెనుతిరిగివెళుతున్నా. ఇక్కడ అధికారి బదిలీ అయినట్లు ఎవరికీ తెలియదు.

–కర్రి రాజేంద్రప్రసాద్, రైతు, తాళ్లగొమ్ముారు

చింతకాని సబ్‌స్టేషన్ ఎదుట బాధితుల ధర్నా

చింతకాని, ఆగస్టు 11 : విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటనలో చింతకాని సబ్‌స్టేషన్ ఎదుట బాధితులు ఆదివారం ధర్నా చేశారు. జల్లి రాము మండల కేంద్రంలో మిషన్ భగీరథలో ఆపరేటర్‌గా, ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన చింతకానిలో గ్రామీణ ఫీడర్ పరిధిలో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కు సమస్య తలెత్తడంతో ఎల్సీ తీసుకొని స్తంభం ఎక్కగా ఒక్కసారిగా విద్యుత్ ఘాతానికి గురికావడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు రాముని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి క్షీణించడంతో రాము కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని కోరుతూ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాచేశారు. రాము భార్య సరిత మాట్లాడుతూ.. తనకు ముగ్గురు సంతానమని మా కుటుంబానికి దిక్కెవరని, ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు మా కుటుంబానికి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ధర్నా చేస్తున్న రాము కుటుంబసభ్యులు


ALL TIME CLASSIC MOVIE
RE-RELEASING IN 4K DOLBY AUDIO
నేడే చూడండి
సుదర్శన్ 35 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
11.00,2.30,6.00,9.30
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
తారకరాము 70 - కాచిగూడ 11.00,2.15,5.45,9.15 కోహినూర్ 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.30,6.00,9.15
మల్లికార్జున - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.45
సాయిరంగ - మియాపూర్ 11.00,2.00,6.00,9.00
BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.15,6.00,9.15
భుజంగ ఎ/సి - జీడిమెట్ల 11.00,6.00PM
అలంకార్ - లంగర్‌హౌస్ 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ ఎ/సి - అంబర్‌పేట 11.00,2.15,6.00,9.15
వెంకటేష్ ఎ/సి - ఖైరతాబాద్ 11.15,2.45,6.00,9.15
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 10.00,2.00,6.00,10.00
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి 10.00,2.00,6.00,10.00
PVR గలేరియా - పంజాగుట్ట 10.30,7.00,11.00
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 11.20,6.30,10.30
PVR పివిఆర్ - మూసారంబాగ్ 10.00,2.00,6.00,10.00
PVR ప్రెస్టేజ్ ప్రైమ్ - గచ్చిబౌలి 10.00,11.00,6.00,10.00
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 10.30,2.30,6.30,10.30
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 10.00,1.15,2.30,5.00,6.30,9.00,10.10
INOX పత్తేషాహ్ మాల్ - కూకట్‌పల్లి 11.00,1.40,5.40,9.40
INOX అశోక ఎ/సి